www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 10 డిసెంబర్ 2023
5
అన్నమయ్య

షాపుల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి సిఆర్‌పిఎఫ్ క్యాంపస్‌లో అద్దెకు షాపుల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిఆర్‌పిఎఫ్ డిప్యూటీ కమాండెంట్ సంజయ్ ఓరా తెలిపారు. క్యాంపస్‌లో టైలరింగ్ షాప్ నిర్వహణ, జవాన్ల యూనిఫామ్‌ల విక్రయ దుకాణం, కూరగాయలు, పండ్ల దుకాణం, చెప్పులు కుట్టే దుకాణం, బేకరీ షాప్, స్వీట్ స్టాల్స్, కూల్ డ్రింక్స్ దుకాణం, క్యాంటీన్ షాపుల నిర్వహణ కొరకు అద్దెకు రూములను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం రూములకు అద్దె, విద్యుత్ ఛార్జీలను చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కొంత బిల్డింగ్ ఫండ్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అవసరమైన వారు తమ లిఖిత పూర్వక అంగీకారంతో పాటు వారి ఐడి ప్రూఫ్‌ను జత పరిచి ఈ నెల 15వ తేదీ లోపు కార్యాలయానికి పోస్ట్ ద్వారా లేదా కంట్రోల్ రూమ్ దగ్గర ఉంచిన డ్రాప్ బాక్స్‌లో వేయవచ్చునని తెలిపారు. ఏదైన వివరాలకు కంట్రోల్ రూమ్ నెం.9391762410లో సంప్రదించాలని డిప్యూటీ కమాండెంట్ సంజయ్ ఓరా తెలిపారు

కరువు.. ఏకరువు!

ఎన్నికలొస్తున్నాయ్..రోడ్లేయండి మహాప్రభో

కలెక్టర్‌ను శరణుజొచ్చిన ఎంపిపి, జడ్‌పిటిసిలు

ఎంపీలు, ఎమ్మెల్యేలు డుమ్మా

నాలుగు తీర్మానాలు ఏకగ్రీవం

ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం కరువు పరిస్థితులపై ఏకరువు పెట్టింది. శనివారం చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2023-24 ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో వర్షాభావం నెలకొన్న నేపథ్యంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు హాజరై అర్థవంతమైన చర్చ చేసి, జిల్లాకు రావాల్సిన నిధులు, ఇతర వ్యవహారాలను రాబట్టుకోవాలి. ఇటువంటి కనీస ప్రయత్నం చేయకుండా తుపాన్, వరదలు, వర్షాభావానికి రైతులను గాలికొదిలేయడం బాధ్యతా రాహిత్యమనే చెప్పాలి. ప్రతిపక్ష టిడిపి ఎంఎల్‌సి, జడ్‌పిటిసి, ఎంపిపిలకు అవకాశం దొరికినప్పటికీ సమర్థవంతమైన పాత్ర పోషించకపోవడం మైనస్‌గానే చెప్పకోవాలి. కడప, రాజంపేట ఎంపీలు, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, బద్వేల్ ఎమ్మెల్యేలకు సైతం ప్రజాసమస్యలు, బాధలు, పట్టలేదు.

జడ్‌పి సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ వీరపునాయునిపల్లి జడ్‌పిటిసి తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి ఎంఎల్‌సి రామగోపాల్‌రెడ్డి స్పందిస్తూ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడానికి గల కారణాలేమిటని, అధికారుల తప్పిదమా, ప్రభుత్వ తప్పిదమా అనేది తేల్చాలని నిలదీయడంతో గందరగోళం నెలకొంది. పొరుగు జిల్లాలైన కర్నూలు, అనంతపురం జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ గైడ్‌లెన్స్‌లోని ఐదు పారా మీటర్లలో మూడు పారామీటర్లు సరిపోలితే కరువు ప్రాంతంగా ప్రకటించే అవకాశం ఉందన్నారు. ఫలితంగా పంట రుణాల రీషెడ్యూల్ కావడం, ఉపాధి పనుల సంఖ్య పెరగడం వంటి ఫలితాలు లాభించే అవకాశం ఉందన్నారు. దీనిపై డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా మాట్లాడుతూ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఇన్సూరెన్స్ కోసం ధర్నాలు చేయాల్సి వచ్చిందని గుర్తు చేశారు. కమలాపురం ఎంఎల్‌ఎ రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురిశాయన్నారు. జిల్లా వ్యవసాయఅధికారి మాట్లాడుతూ జిల్లాలో డ్రైస్పెల్స్ కారణంగా రైతులు సకాలంలో విత్తలేక పోయారన్నారు. కడప, కమలాపురం, జమ్మలమడుగు, పులివెందుల డివిజన్లలో 11 వేల హెక్టార్లలో వర్షాభావం కొనసాగుతోందన్నారు. తాజా మిచౌంగ్ తుపాన్ కారణంగా 26 మండలాల పరిధిలోని 119 గ్రామాల్లో పంట నష్టం వాటిల్లిందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలు అందగానే పూర్తిస్థాయి నివేదికను రూపొందించి, ఆర్‌బికెల్లో మూడ్రోజులపాటు ప్రదర్శనకు ఉంచుతామన్నారు. రైల్వేకోడూరు ఎంఎల్‌ఎ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు తుపాన్ బారిన పడుతుండడం పరిపాటిగా మారిందని, ఎన్యూమరేషన్ విషయంలో 30 శాతం నిబంధన మేర పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇ-క్రాప్ చేయని పంట నష్టాలను కూడా ఎన్యుమరేషన్ చేసి వివరాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. చక్రాయపేట జడ్‌పిటిసి మాట్లాడుతూ వరద పరిహారం చెల్లించడంపై తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ చేసే అవకాశాన్ని ప్రతిపాదించాలని చెప్పారు. కలెక్టర్ విజయ్‌రామరాజు స్పందించి ఎన్యూమరేషన్ చేసిన అనంతరం ఆర్‌బికెల దగ్గర మూడ్రోజులపాటు ప్రదర్శనకు ఉంచాలని చెప్పారు. వేంపల్లి ఎంపిపి రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ వేంపల్లి ఆస్పత్రిలో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని, ఆధునిక పరికరాల కొరత కారణంగా కంటి, గర్భిణీ సంబంధిత సమస్యలకు ఆపరేషన్ చేసే అవకాశం లేకుండా పోయిం దన్నారు. ఎంఎల్‌సి రామ్‌గోపాల్‌రెడ్డి స్పందించి రాజంపేట ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ రోగులు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోందని, డయాలసిస్ పరికరాలతో కూడిన ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుందని తెలిపారు. బి.మఠం జడ్‌పిటిసి మాట్లాడుతూ డ్వామా ఆధ్వర్యంలోని రూ.40 కోట్లతో గ్రావెల్‌రోడ్లు నిర్మించాలని, త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ స్పందించి మండలానికి రూ.50 నుంచి రూ.60 లక్షల వరకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. గ్రామాలకు వెళ్లడానికి రోడ్లు సక్రమంగా లేవని, ఎన్నికల నేపథ్యంలో పల్లెలకు వెళ్తే నిలదీసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చక్రాయపేట జడ్‌పిటిసి స్పందిస్తూ చిన్నచిన్న సమస్యల కారణంగానే పల్లెలకు వెళ్లలేకపోతున్నామని, కలెక్టరే స్వయంగా రోడ్లు పలు ఇతర సమస్యల్ని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. బి.మఠం ఎంపిపి వీర నారాయణరెడ్డి మాట్లాడుతూ రెండు నెలల్లో ఎన్నికలొస్తున్నాయని, రేకులకుంటలో 300 ఇళ్లస్థలాల స్వీకరణకు లబ్ధిదారులు నిరాకరిస్తున్నారని, ఇతర ప్రాంతానికి ప్లాన్ మార్చాలని విజ్ఞప్తి చేశారు. బద్వేల్-ముత్తుకూరు, బద్వేల్-బి.మఠం, మైదుకూరు- వెంకటాపురం టిజిపి రహదారి సమస్య, నీటి వృథా చేయడం వంటి అంశాల ఎంపిపి, జడ్‌పిటిసి ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం వరద పరిహారం చెల్లింపు, జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని, అరటికి బీమా సదుపాయం, నరేగాలో గ్రావెల్‌రోడ్ల నిర్మాణానికి సంబంధించిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, ఎంఎల్‌సి రమేష్‌కుమార్ యాదవ్, పలు కార్పొరేషన్ల చైర్మన్‌లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి శంకుస్థాపనలు చేయనున్నారు. గోపనపల్లి, గుండ్ల చెరువు సచివాలయాల పరిధిలో గాలివీడు, బుట్టిగారిపల్లి, శెట్టివారిపల్లెలో సిసి రోడ్లు, వాటర్ ట్యాంకు తుముకుంట ప్రకాష్‌నగర్ కాలనీలో తారు రోడ్డు నిర్మాణాను ఆయన ప్రారంభించనున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్వహించనున్నారని డాక్టర్ ఎల్.వి.ప్రసాద్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొని పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తారన్నారు.

ప్రకోపం

ప్రజాదృష్టి

ప్రకృతి ప్రకోపానికి రైతాంగం భారీ మూల్యం చెల్లిస్తోంది. పారిశ్రామిక, సేవల రంగాలకు ఎటువంటి ప్రమాదం లేదు. మానవుడు ప్రకృతి మీద చేసే ఆధిపత్య ప్రయత్నాలు బెడిసి కొడుతూనే ఉన్నాయి. మానవులు గుణపాఠం నేర్వడం లేదు. ప్రతి ఏటా నవంబర్, డిసెంబర్ మాసాల్లో అల్పపీడనాలు, ద్రోణుల పేరుతో తుపాన్‌లు చెలరేగడం కద్దు. ఇటువంటి వాతావరణ పరిస్థితులను, తుపాన్ కష్టాలను, నష్టాలను తట్టుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా కృషి చేస్తే నష్టాలను తగ్గించుకోవచ్చని పలు అధ్యయనాలు చెబుతూనే ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చెవికి సోకడం లేదు. కల్వర్టులు, చెరువుల ఆక్రమణలను అరికట్టడం, వరద ప్రభావిత ప్రాంతాల్లో శాశ్వత నిర్మాణాలు చేపట్టడం, పొలాల్లోకి చేరిన వరద కారణంగా తలెత్తే నష్టాలను తగ్గించడానికి తేమ శాతం వంటి ఆంక్షలు సడలించడం, సకాలంలో బీమా, ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలను కల్పించడం వంటి భరోసానిచ్చే ప్రయత్నాలు చేపట్టాలి. ఇటువంటి పనులేవీ చేయకుండా, ఆరోగ్యకరమైన చర్చల్లో పాలుపంచుకోకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. డబ్ల్యూటిఒ వాణిజ్య సంస్థ ఆక్షల నేపథ్యంలో రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. కానీ రాజకీయ నాయకత్వాలకు రైతు ఆత్మలగోడు పట్టడం లేదు. భవిష్యత్‌లో వ్యవసాయాన్ని ప్రయోగశాలల్లో చూడాల్సి వస్తుందేమోననే భావన కలుగుతోంది. ఇటీవల మిచౌంగ్ తుపాన్ జిల్లాలో కొనసాగుతున్న వర్షాభావం పరిస్థితులకుతోడు, వరద ప్రమాదం నష్టాలను చవిచూపించింది. కరువు, వరద పరిస్థితుల తాకిడికి ఖరీఫ్, రబీ సీజన్‌లో బోర్లు, బావుల కింద సాగు చేసిన సుమారు 20 వేల ఎకరాల్లోని పంటలను సైతం వరద ముంచెత్తింది. ఫలితంగా పండిన పంటలు, కుప్పలు, నూర్పిడి దశలోని పంట వర్షార్పణమైంది. ఫలితంగా జిల్లా వ్యవసాయ రంగం కుదేలైంది. ఇటువంటి విభిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతు జీవితం కన్నీరు సుడులు తిరుగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో రైతుకు అండగా ఉండాల్సిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు పట్టించుకున్న దాఖలాల్లేవు. మిచౌంగ్ తుపాన్ ముగిసిన వెంటనే ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి అన్నమయ్య జిల్లా నుంచి ఉన్నతాధికారులు, కడప, రాజంపేట ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. జిల్లా సమ్మిళిత అభివృద్ధికి వ్యవసాయ, పారిశ్రామిక, సేవలు రంగాలు కీలకమైనవి. వ్యవసాయ రంగం ప్రాణాధారం. ఇటువంటి వ్యవసాయ రంగం ఆపదల బారిన పడినప్పుడు రాజకీయ నాయకత్వం ముందుండి భరసా ఇవ్వాలి. అటువంటి ప్రయత్నాలు చేయకుండా, వ్యాపారాలు, కార్యక్రమాలకు పరిమితం కావడం ఆందోళనకరం. మిగిలిన సమయాల్లో ఎట్లా వ్యవహరించినప్పటికీ ఎవరికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. కానీ ఆపద, బాధల సమయాల్లో రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత రాజకీయ నాయకత్వాలపై ఉంది. ఇటువంటి పరిణత రాజకీయ నాయకత్వం కొరవడడం దురదృష్టకరమనే చెప్పాలి.

– ప్రజాశక్తి - కడప ప్రతినిధి

లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి షేక్ పైజున్నిసా

రాజీ మార్గమే రాజమార్గం : జడ్జి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

క్షణికావేశంలో గొడవలు పడి కేసులు పెట్టుకుని కోర్టుకు వెళ్లి ఇబ్బందులు పడకూడదని రాజీ మార్గమే రాజమార్గమని లక్కిరెడ్డిపల్లె మండల్ లీగల్ అథారిటీ కమిటీ చైర్మన్, లక్కిరెడ్డిపల్లి సివిల్ కోర్టు జడ్జి షేక్ పైజున్నిసా పేర్కొన్నారు జాతీయ లోకాదళత్ కార్యక్రమంలో భాగంగా శనివారం లక్కిరెడ్డిపల్లి కోర్టులో లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 49 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. అందులో రూ.29,25,180 వసూలైనట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా పక్షదారులు చిన్న చిన్న గొడవలకు పాల్పడకుండా సమస్య రాజీగా పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎంఎల్ రామచంద్రారెడ్డి, చెన్న కృష్ణయ్య, బాలాజీరెడ్డి, సిఐ జీవన గంగనాద బాబు, ఎస్ఐలు మల్లికార్జున్‌రెడ్డి, వినోద్ కుమార్, కొండారెడ్డి, కక్ష దారులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు** : స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలతో 89 కేసులు పరిష్కారమయ్యాయని జూనియర్ సేవలు జడ్జి అంజనీ ప్రియదర్శిని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె మండలాలకు సంబంధించిన సివిల్ క్రిమినల్ చెక్బాన్స్ మ్యాట్రిమోనీ కేసులు దాదాపు 29 కేసులు పరిష్కారం కాగా ఇందులో భాగంగా రూ.39,59,495 వివిధ కేసులకు కేసులలో కక్షిదారులకు ఇప్పించామన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌కు సంబంధించి రుణాలు తీసుకున్న వారు కూడా ఇందులో సెటిల్మెంట్లు చేసుకోవడం శుభ పరిణామన్నారు కార్యక్రమంలో సిఐ మధుసూదన్ రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, డాక్టర్ నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.వెంకట్రామరాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం

- ప్లాస్టిక్ కవర్లు తిని పశువులు మృతి
- నిషేధం ప్రకటనలకే పరిమితం
- పట్టని అధికారులు

పట్టణంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్ల విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. జిల్లాలో రాయచోటి, రాజంపేట, మదనపల్లె మున్సిపల్ కేంద్రాలతో పాటు నియోజకవర్గాలు, మండల, గ్రామీణ ప్రాంతాలలో ప్లాస్టిక్ వాడకం అధికమైంది. ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్ల నిషేధం చేసి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది. జిల్లా వ్యాప్తంగా ఏ దుకాణంలో చూసిన ప్లాస్టిక్ కవర్ల వినియోగం ఎక్కువగా ఉంది. గతంలో అధికారులు మాత్రం ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించరాదని, కేవలం బట్టలతో తయారు చేసిన సంచులను వాడాలని చెప్పారు. మున్సిపాలిటీలో గతంలో ప్లాస్టిక్ నిషేధం విధించి అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహించారు. కవర్లు దొరికిన దుకాణదారునికి జరిమానాలను విధించడంతో కొంతమేరకు అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకోగలిగారు. కాలక్రమమైన మున్సిపాలిటీలో కూడా ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా వినియోగం ఎక్కువైంది. ఇక జిల్లా కేంద్రంలో డ్రెయినేజీ వ్యవస్థ అంతంత మాత్రమే ఉంది. దీనికి తోడు ప్రజలు వారు మార్కెట్లను తెచ్చుకున్న ప్లాస్టిక్ కవర్లను తిరిగి చెత్త బుట్టలో వేయకుండా ఎక్కడబడితే అక్కడ వేయడం వల్ల మూగజీవాలు వాటిని తిని అరుగుదల లేక ప్రాణాలకు కోల్పోతున్నాయి. ముఖ్యంగా మాంసం కొట్టు, కూరగాయల, పండ్ల దుకాణాలలో ప్లాస్టిక్ వల్ల వినియోగం ఎక్కువగా మారింది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువల్లో వేయడం వల్ల డ్రెయినేజీలో నీరు స్తంభించి రోడ్లపై పారుతున్నాయి. రోడ్డు పక్కన ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి వాటిని సకాలంలో పారిశుధ్య సిబ్బంది తొలగింకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మున్సిపాలిటీలో దుకాణాల్లో ప్లాస్టిక్ నిషేధం విధించకపోవడంతో పర్యావరణానికి పెనుముప్పు కల్గనుంది. అధికారులు అప్పుడప్పుడు తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తూ చిన్నాచితక తోపుడు వ్యాపారులపై వారి ప్రతాపం చూపిస్తూ వారికి పెనాల్టీ నిర్వహిస్తూ చేతులు తెలుపుకుంటున్నారు. కానీ యథేచ్ఛగా కవర్లని ఎక్కడి నుంచి వస్తున్నాయి అనే విషయంపై వారు మాత్రం శ్రద్ధ చూపకపోవడం గమనార్హం. ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు చేస్తున్న హోల్‌సేల్ వ్యాపారులపై మాత్రం అధికారులు దాడులు నిర్వహించకపోవడంతో ఈ ప్లాస్టిక్ కవర్లో పట్టణలలో విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్లాస్టిక్ కవర్లు అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం

జిల్లావ్యాప్తంగా ప్లాస్టిక్ కవర్లు వాడకూడదని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇంటి నుంచి బజారుకు వెళ్ళేటప్పుడు బ్యాగులు తీసుకెళ్లాలి. ఎక్కడైనా ప్లాస్టిక్ కవర్లు ముమ్ము తున్నారని ప్రజలు ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్య తీసుకుంటాం. జిల్లాలో ప్లాస్టిక్ కవర్లను అరికట్టడానికి అన్ని చర్య తీసుకుంటున్నాం.

- ఎం.ధనలక్ష్మి, డిపిఒ, రాయచోటి.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడీలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

అంగన్వాడీ వర్కర్లు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు పిలుపు నివ్వడంతో అధికారులు ఈ నెల 11న చర్చలకు ఆహ్వానించారని ఈ చర్చల్లో డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించకుంటే సమ్మె కొనసాగిస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో అంగన్వాడీల ప్రాజెక్టు కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎన్నికల ముందు అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా రూ.వెయ్యి ఇస్తామనీ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని నేడు నోరు మెదపడం లేదని పేర్కొన్నారు. ఇది అంగన్వాడీలను మోసం చేయడమేనన్నారు. కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యాణ, చత్తీస్‌ఘడ్‌లో మాదిరి రిటైర్మెంట్ బెనిఫిట్, గ్రాట్యూటి అమలు చేయాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలన్నారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లగా గుర్తించాలన్నారు. ప్రమోషన్లు, బదిలీలు ఇవ్వాలన్నారు. నాణ్యమైన పాలు, గుడ్లు, పౌష్టికాహారాన్ని సరఫరా చేయాలన్నారు. కొత్త సెంటర్ల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. అనంతరం సమ్మె కరపత్రాలు విడుదల చేసి మూడురోడ్ల సర్కిల్‌లోనూ లబ్దిదారులకు విస్తృత కరపత్రాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.సుకుమారి, ఎస్.ఓబులమ్మ మాట్లాడుతూ అంగన్వాడీలు చేస్తున్న న్యాయమైన డిమాండ్ల సాధనకై జరుగుతున్న సమ్మెకు ప్రజా సంఘాలు, వ్యాపారులు, ప్రజాస్వామ్య అభ్యుదయ వాదులను కలసి మద్దతు కోరతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బి.సి.రెడ్డెమ్మ, సి.ప్రభావతమ్మ, ఇరగమ్మ, నాగమణి, రుక్మిణమ్మ, శిరీష పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మిచౌంగ్ తుపాన్ కారణంగా నష్టపోయిన ప్రతి రైతును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని శేషమాంబాపురం పంచాయతీలోని బాలిరెడ్డిగారిపల్లెలో మిచౌంగ్ తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పంట చేతికొచ్చే సమయానికి తుపాన్ కారణంగా పంటలన్నీ తుడుచుపెట్టుకుపోవడంతో అన్నదాత కుదేలయ్యారని పేర్కొన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి కంటి తుడుపు చర్యలు కాకుండా పూర్తి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జనసేన పార్టీ రైతుల పక్షాన ఎల్లవేళలా అండగా ఉంటుందని రైతులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో రాజంపేట మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు, శివరామరాజు, ఆకుల చలపతి, పివిఆర్ కుమార్, చిట్టే భాస్కర్, మౌల, స్థానిక రైతులు నరసింహారాజు, రాజేష్ వర్మ, శ్రీను, సుబ్రహ్మణ్యం రాజు, రవీంద్ర, వెంకటరామరాజు, సుబ్బలక్ష్మమ్మ, రామచంద్రయ్య, శ్రీను, సుబ్బరామరాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెలిగల్లు కమ్యూనిటీ హాల్ ప్రహరీ నిర్మాణం

రూ.17 లక్షలతో ప్రహరీ నిర్మాణం

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని వెలిగల్లులో రూ.12 లక్షలతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించామని, మరో రూ.17 లక్షల వ్యయంతో ప్రహరీని నిర్మిస్తున్నామని సర్పంచ్ నఫీస్ పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2008లో వెలిగల్లులో ముంపు గ్రామం కింద కమ్యూనిటీ హాల్ భవనాన్ని నిర్మించారని పేర్కొన్నారు. ఇప్పటికీ ఆ భవనం సమావేశాలకు ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికీ 90 శాతం పని పూర్తయినట్లు తెలిపారు. మరో రెండు మూడు రోజుల్లో ప్రహరీ నిర్మాణం పూర్తి చేయనున్నట్లు ఆమె తెలిపారు.రాయచోటి శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి అందించిన సహకారం వల్ల గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు

శాంతికి చిహ్నం క్రిస్మస్ : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రేమ, శాంతి, సంతోషాలకు చిహ్నం క్రిస్మస్ అని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మదనపల్లె రహదారి మార్గంలోని ఐసిసి చర్చి గ్రౌండ్ లో రాయచోటి ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే చేత కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కీస్తు జననం మానవాళికి శుభకరమన్నారు .క్రీస్తు బోధనలను అందరూ ఆచరించాలన్నారు. క్రిస్టియన్ల సమస్యల పరిష్కారానికి ఎంపీ మిథున్, తాము కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైఎస్ఆర్ సిపి నాయకుడు ఫయాజ్ అహమ్మద్ మాట్లాడుతూ రాయచోటిలో పెద్ద ఎత్తున సెమీ క్రిస్మస్ వేడుకలు జరగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు విజయ్, ప్రభుదాస్, సునీల్, వర్మ,రాజు, డేవిడ్ పాల్గొన్నారు.

డిఎస్‌పి కార్యాలయం తరలింపు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆర్ఎస్ రోడ్డులోని డిఎస్‌పి కార్యాలయాన్ని బోయినపల్లి సమీపంలోని ఎంవిఐ కార్యాలయం వెనుక వైపున ఉన్న హార్టికల్చర్ కార్యాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లోకి మార్చామని డిఎస్‌పి వి.ఎన్.కె. చైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట సబ్ డివిజన్లోని అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బంది, ప్రజలు సహకరించవలసిందిగా కోరారు. ఇక్కడి నుంచే విధులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

గాలివీడులో ఆగని 'రియల్' దందా

గాలివీడులో అక్రమంగా వెలసిన వెంచర్

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలో కొందరు అనుమతులు లేకపోయినా విస్తారంగా ప్లాట్లు వేసి భూములను కబ్జా చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ దందా విస్తారంగా సాగుతోంది. వీరికి ఎటువంటి ఆధారాలు కానీ, అనుమతులు గానీ లేకుండానే ప్లాట్లు వేస్తున్నారు. ఆ ప్లాట్ లలో ఉన్న ప్రభుత్వ స్థలాలు రహదారులను కూడా కలుపుకుంటున్నారు. గాలివీడు పంచాయతీ పాత నమస్కట్ట వెనుక వైపున అక్కడి నుంచి దయ్యాల మడుగుకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం ఉంది. ఆ రోడ్డు సైతం ఆక్రమించి ప్లాట్ వేస్తున్నారు. పూర్వకాలం నుంచి ఈ దారి గుండా ఎద్దుల బండ్లు వెళ్లేవి. రైతులు కూడా తమ పొలాలకు వెళ్లేవారు. ఇప్పుడు ప్లాట్లకు గిరాకీ పెరగడంతో ఆ రహదారిని ఆక్రమించి ప్లాట్లుగా మార్చేశారు. అక్టోబర్ 27న నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారంపై చర్చించారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఎక్కడపడితే అక్కడ ప్లాట్లు వేస్తున్నారని వీటిపై చర్యలు తీసుకోవాలని మండల వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషన్‌రెడ్డి ప్రస్తావించారు. ఇప్పటికీ దందా నడుస్తున్నా రియల్ వ్యాపారులకు నోటీసులు పంపిన దాఖలాలు లేవు. ఆక్రమించిన వారిపై కేసులు కూడా పెట్టాలని ఆయన హెచ్చరించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకుంటేే తప్ప ప్రభుత్వ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా రక్షించుకోగలుగుతారు కుంటలు, చెరువులు, కొండలు, గుట్టలన్నీ కనుమరుగవుతున్నాయి. ప్రభుత్వ అధికారులు స్పందించి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు నోటీసులు ఇవ్వాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బత్యాల

ఓటమి భయంతోనే 27 యాక్ట్ జిఒ జారీ : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వచ్చే ఎన్నికల్లో ఓటమిని చవిచూస్తామన్న భయంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 27 యాక్ట్ చీకటి జిఒను రాత్రికి రాత్రే జారీ చేశారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్రాయులు అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జుడిషియల్ పవర్స్ లేకుండా 27 యాక్ట్‌ను మంజూరు చేయడం దారుణమన్నారు. ఈ జిఒ మొత్తం వైసిపి స్వలాభాల కోసమే చేశారని ఆరోపించారు. సాధారణంగా భూముల విషయంలో, అన్నదమ్ముల మధ్య గాని, కుటుంబ సభ్యుల మధ్య గాని అన్యాయం జరిగితే కోర్టుకు వెళ్లవచ్చునని తెలిపారు. ఈ 27 యాక్ట్ జిఒలో కేవలం డిప్యూటీ తహశీల్దార్లకు పూర్తి అధికారం ఇచ్చి కోర్టుకు న్యాయవాదులు, బాధితులు అప్పిలేట్ చేసుకునే వీలు లేకుండా చేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఎవరైనా వైసిపికి ఎదురు చెప్పితే అటువంటి వారి భూములను ఏకంగా వేరే వాళ్ళ పేరుతో మార్పు చేసి బెదిరించేందుకు ఈ యాక్టును తీసుకొచ్చారని తెలిపారు. కావున వెంటనే ఈ 27 యాక్ట్ జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ ఎన్నికలప్పుడు కూడా ఎలక్షన్ కమిషన్‌కు అధికారం లేకుండా కేవలం పోలీసులకు అధికారం ఇచ్చి ఏకగ్రీవాలు చేసుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం వచ్చే ఎన్నికల్లో కూడా అదేవిధంగా చేసేందుకు జుడిషియల్‌కు అధికారం లేకుండా చేసి ఈ యాక్టును తీసుకొచ్చారని విమర్శించారు. జగన్ ఎన్ని జిఒలు తీసుకొచ్చి ఓటర్లను భయపెట్టినా వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక ఇలాంటి పిచ్చి జీవోలు అన్నింటిని తమ నాయకుడు నారా చంద్రబాబు నాయుడుకు చెప్పి రద్దు చేయించి చెత్త బుట్టలో వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు కేటాయించిన స్థలం

జర్నలిస్టులకు కేటాయించిన స్థలం కబ్జాయత్నం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ బెంగళూరు రోడ్డు సర్వే నంబర్ 239లో 1.15 ఎకరాల్లో మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇంటి పట్టాలను ప్రభుత్వం మంజూరు చేసింది. గతంలో ఈ ప్రభుత్వ భూమిలో కొందరు రిజిస్ట్రేషన్ చేసుకుని భూమిని చదును చేయకుండా అడ్డుకున్నారు. ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీస్‌స్టేషన్‌లఓ ఫిర్యాదు చేశారు. దీనిపైన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో జర్నలిస్టులు ఈ ఘర్షణపై మదనపల్లి న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఆ భూమికి న్యాయస్థానం ఇతరులు ఎవరూ ప్రవేశించడానికి వీలులేకుండా ఇంజక్షన్ ఉత్తర్వులను మంజూరు చేసింది. గతంలో ప్రభుత్వ పట్టాను మంజూరు చేసి తర్వాత రద్దు చేసిన వారు కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి జెసిబితో భూమిని చదును చేసే కార్యక్రమాలను మొదలుపెట్టారు. జర్నలిస్టులు బి.కొత్తకోట పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేశారు. తమకు కేటాయించిన భూమిని కబ్జాదారుల నుండి కాపాడాలని పాత్రికేయులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

ప్రహరీ నిర్మించాకే రోడ్డు విస్తరణ చేపట్టాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక, జడ్‌పి ఉన్నత పాఠశాలల ఆవరణంలోని ప్రహరీ, మరుగుదొడ్లను ఏర్పాటు చేసిన తర్వాతనే జడ్‌పి హైస్కూల్ ప్రహరీని పడగొట్టాలని శనివారం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వేంపల్లి-రాయచోటి ప్రధాన రహదారి విస్తరణ భాగంగా జడ్పీ పాఠశాల ప్రహరిని పగలకొట్టికెందుకు అధికారుల సిద్ధంగా ఉన్నారని అయితే దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులు పడతారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు 287 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో టివి, కంప్యూటర్ సహా ఇతర విలువైన వస్తువులు ఉన్న కారణంగా ప్రహరీ గోడ లేకపోతే వాటిని రక్షించడం కష్టమని, అందుకోసం తొలుత బాత్రూములు, ప్రహరీ నిర్మించి ఆ తర్వాత ప్రస్తుతం ఉన్న వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరతి గతిన విస్తరణ పనులు పూర్తి చేయాలంటూ ఉపధ్యాయులు వేంకటేశ్వర్లు, వేమిరెడ్డి సుబ్బారెడ్డి, రెడ్డెన్న, స్కూల్ కమిటీ సభ్యులు ముబారక్, రవిశంకర్, ఛాన్ బాషాలతో కలిసి ఎమ్మెల్యేకి వినతిపత్రం అందించారు. సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

రహస్యంగా జూదమాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు బి.కొత్తకోట స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి.యస్.ప్రశాంత్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో పేకాట ఆడుతున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని అయ్యావారిపల్లి గ్రామ సమీపంలోని గుట్ట దగ్గర కంపచెట్లు కింద పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. నంజుండి బుచ్చి రెడ్డి, యస్.సౌకత్, బి.సలీం, యన్.పాపన్న, ఏ.కిరణ్ కుమార్ అనే వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.12,830 వేలు నగదుతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకొన్నామని పేర్కొన్నారు.

అరెస్టయిన జూదరులు

మండల అభివృద్ధికి కృషి చేయండి : ఎంపిపి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

అధికారులు, ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని ఎంపిపి నరసింహులు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపిపి డి.నరసింహులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ శాఖల త్రైమాసిక ప్రగతిని నివేదికను సమావేశంలో చదివి వినిపించారు. ఈ సమావేశానికి ఎంపిపి నరసింహులు హాజరై వివిధ శాఖల త్రైమాసిక ప్రగతిని సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నవరత్న హామీలలో భాగంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు దక్కేలా అధికారులు పనిచేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే నవాజ్‌బాష ప్రజల కోసం నిత్యం కృషి చేస్తున్నారని తెలిపారు. పథకాల లబ్ధిని ప్రజలకు చేర్చి, ప్రభుత్వ పనితీరుపై ప్రజల మద్దతు లభించేలా దోహదపడాలన్నారు. గ్రామాల్లోని సమస్యలను ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చి, చిత్తశుద్ధితో పరిష్కరించాలని పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని, గ్రామాలలో పారిశుద్యం పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలులో ప్రజా ప్రతినిధులు భాగస్వాములు చేయాలని అధికారులు కోరారు. జగనన్న హౌసింగ్ లబ్దిదారులకు బిల్లులు సమస్యలు లేకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ రీ సర్వేలో అవకతవకలు జరిగాయని, ఒకరి రికార్డులు మరొకరికి పాస్ పుస్తకాలలో ముద్రించారని తవళం గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు ఎంపిపి నరసింహులు, తహశీల్దార్ మంజుల దృష్టికి తీసుకువచ్చారు. భూ రి సర్వేలో సమస్యలున్న రైతులు తమ దృష్టికి సమస్యలను తీసుకువస్తే పరిష్కరిస్తామని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 25 సెంట్లు భూమి నుంచి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి నరసింహులు

ఒక ఎకరం వరకు పశుగ్రాసం వేసిన రైతులకు సుమారు లక్ష రూపాయల వరకు ప్రభుత్వము మంజూరు చేస్తున్నాదని, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి రహదారులు భవనాల శాఖ, పట్టు పరిశ్రమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, ఎక్సైజ్ శాఖ, ఆర్టీసీ రవాణా శాఖకు సంబంధించిన హాజరుకాని అధికారులకు చార్జ్ మెమోలను జారీ చేస్తున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. మండల వ్యాప్తంగా నాటు సారా తయారీ, విక్రయాలు అధికంగా ఉండాలని పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు నిత్యం దాడులు నిర్వహించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రెడ్డి, మండల వైసిపి మాజీ ఇన్‌ఛార్జి ఆర్‌ఐ రమణారెడ్డి, వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, సుజాత, కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, తహశీల్దార్ సి.ఆర్ మంజుల, ఎంపిడిఒ శేషగిరిరావు, ఇఒపిఆర్‌డి చలపతిరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం : టిడిపి

దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె

మిచౌంగ్ తుపాను వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ అన్నారు. శనివారం వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆయన టిడిపి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రికి బంగాళదుంప ఏదో ఉల్లిగడ్డ ఎదో తేడా తెలియకుండా ఉందన్నారు. సిఎం పర్యటన కంటితుడుపుగానే ఉందన్నారు. తుపాన్ సమయంలో మంత్రి రోజా రీల్స్ వీడియోస్ చేస్తూ జబర్దస్త్ డాన్సులు చేస్తూ ప్రజలకు కనువిందు చేస్తున్నారని, మంత్రిగా బాధ్యతలు పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చేతికొచ్చిన పంటలో పూర్తిగా నష్టపోయారని, రాయలసీమలో వరి ఉద్యాన పంటలైన టమోటా, అరటి మొదలైనవన్నీ పూర్తిగా నష్టం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం క్రాప్ ఇన్సూరెన్స్ చేయకుండా రైతులను మోసగించిందని చెప్పారు. 16 మంది రైతులకు మాత్రమే ఇన్సూరెన్స్ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని తెలిపారు. ఈ విధంగా రైతులను మోసగించడం జగన్మోహన్‌రెడ్డికే చెల్లిందని పేర్కొన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామాచార్లపల్లి వద్ద మొలకెత్తిన పంటను పరిశీలించి నీటిలో నుండి వరిపంటను కోయడానికి అధిక కూలీలను బీహార్ నుండి తెప్పించారని దానికి అదనంగా ఖర్చులు తడిసి మోపిడుగుతున్నాయని పేర్కొన్నారు. పంట గిట్టుబాటు కాకుండా ఉందని రైతులు పేర్కొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు కార్యనిర్వాహ కార్యదర్శి రాటకొండ మధుబాబు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నవీన్ చౌదరి, రాజన్న, రెడ్డప్ప, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనకు నిదర్శనం జగన్ : 'చింతల'

ప్రజాశక్తి- కలకడ

అవినీతి రహిత పాలనకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిదర్శనమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముడియం వారిపల్లి పంచాయతీలోని సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కి జగన్‌నే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా చింతల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలన్నిటిని నెరవేర్చాలని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను కుల మతం వర్గం చూడకుండా ఎటువంటి అవినీతికి తావులేకుండా పార్టీలకతీతంగా అందరికీ అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని విద్యార్థులకు, రైతులకి, ప్రజలకి ఉద్యోగులకి అందరికీ కూడా మంచి జరుగుతుందని సచివాలయ, వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఎంతో మంచి జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి పంచాయతీలోనూ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ సెంటర్లు, లైబ్రరీలు స్థాపించి అందరికీ చెరువులో స్థానికంగా అన్ని ప్రభుత్వ సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రతి కుటుంబానికి మంచి జరుగుతుందని చెప్పారు. 2024లో ముఖ్యమంత్రి ఆశీర్వదించాలని ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

శ్రీదేవి రవికుమార్, ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, సెక్రటరీ శివాజీ, పార్టీ కన్వీనర్ కమలాకర్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, ముడియం వారిపల్లి సర్పంచ్ శాంతమ్మ, వైసిపి నాయకులు, కుమార్‌రెడ్డి, శంకర్ నాయుడు, బాబు రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు.

'లారీ అసోసియేషన్ స్థలంపై రాజకీయం తగదు'

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ప్రజాశక్తి-మదనపల్లి

లారీ అసోసియేషన్ స్థలంపై రాజకీయ నాయకులు రంగులు పులమడం మానుకోవాలని బిసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బోడెం రాజశేఖర్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీ నేతల విభేదాలు కారణంగానే లారీ అసోసియేషన్ భూమి విషయంలో లారీ యాజమాన్యులకు, కార్మికులకు విఘాతం ఏర్పడిందని పేర్కొన్నారు. 30 ఏళ్ళుగా వందలాది కుటుంబాలు లారీ ట్రాన్స్ పోర్ట్ డిపార్ట్మెంట్ ద్వారా జీవిస్తున్నారని గుర్తు చేశారు. వారు వాహనాల పార్కింగ్ కోసం స్థలం కావాలని దీర్ఘకాలంగా కోరుతున్న విషయం అందరికీ తెలిసిందేనని, అయితే దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ వారికి 1.80 ఎకరాల స్థలాన్ని అధికారులు ప్రతిపాదించడం పట్ల అభ్యంతరాలను ఖండించారు. లారీల పార్కింగ్ స్థలం కబ్జా చేయడానికే నన్న విమర్శలపై ప్రభుత్వ అధికారులే దీనికి సమాధానం చెప్పాలన్నారు. లారీ అసోసియేషన్‌కు స్థలం కేటాయించే విషయంలో పారదర్శకంగా అన్ని సమస్యలను అధికారులు పరిగణలోనికి తీసుకొని వాటికి పరిష్కారం చూపాలన్నారు. ప్రజలకు రక్షణ భద్రత పైన భరోసా ఇవ్వాలన్నారు. తాము ప్రజా సమస్యలపై పోరాటం చేయడానికి ఎప్పుడూ ముందుంటామని ప్రకటించారు. బలహీన వర్గాలు రాజకీయంగా రాణించినప్పుడు మాత్రమే అన్నింట ప్రాధాన్యత దక్కుతుందన్నారు. మదనపల్లిలో జ్యోతిరావు ఫూలే విగ్రహం ఏర్పాటు కోసం పదేళ్ల నుంచి ప్రయత్నం చేస్తున్న దానికి ఇప్పటికి సహకారం అందలేదని వాపోయారు. బిసి వర్గాలకు పెద్దపీట వేసే విధంగా త్వరలోనే బిసిహెచ్‌పిఎస్‌ను జాతీయ స్థాయిలో విస్తరించనున్నామని ప్రకటించారు. మదనపల్లె నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాలు తమ ఓటు ద్వారా నేతలకు గుణపాఠం చెప్పనున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బిసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర గౌరవ సలహాదారులు వైవి.శేఖర్ నాయుడు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సి.రామలింగయ్య, ఉమ్మడి జిల్లాల ప్రచార కార్యదర్శి ఎ.రెడ్డప్ప, మైనారిటీ డివిజన్ అధ్యక్షులు అమానుల్లా, డివిజన్ ఉపాధ్యక్షులు రామకృష్ణ, మదనపల్లె తాలూకా గౌరవ అధ్యక్షులు రమణ, డివిజన్ ఉపాధ్యక్షులు రియాజ్, డివిజన్ గౌరవ సలహాదారులు రఘు, రాయలసీమ యూత్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మణిశంకర్, డివిజన్ ఉపాధ్యక్షులు గురుమూర్తి, తాలూకా మైనార్టీ గౌరవ సలహాదారులు మస్తాన్, మదనపల్లి గౌరవ సలహాదారులు కృష్ణప్ప, మైనార్టీ గౌరవ సలహాదారులు చాంద్ బాషా, తాలూకా యూత్ కార్యదర్శి కుమార్, మదనపల్లి ప్రచార కార్యదర్శి రాజా పాల్గొన్నారు.

ఘనంగా సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లి

నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డి సాహెబ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ 77వ జన్మదినోత్సం సందరకభంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా పేద మహిళలకు చీరల పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మదనపల్లి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, మాజీ కౌన్సిలర్ మీనా కుమారి, డాక్టర్ బాషా, మహమ్మద్ అలీ, శరత్ కుమార్ రెడ్డి, రవి, బక్షు, సయ్యద్, ఈశ్వరమ్మ, రిజ్వనా, అమీర్ జాన్ పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోసాల దేవి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు ఎన్.శాంతయ్య, జిల్లా నాయకులు ప్రతాప్‌రెడ్డి, రైల్వేకోడూరు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నన్నం శివకృష్ణ, పుల్లంపేట మండల అధ్యక్షులు సిగమాల రమేష్, నాగరాజు, ఉప్పుటూరు బ్రహ్మయ్య, ఆదిలక్ష్మి, గద్దె సుధాకర్, సిగమాల శివ, నరసింహులు, సిగమాల రవి పాల్గొన్నారు. **రాయచోటి** :

మదనపల్లె : పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న రెడ్డి సాహెబ్

పట్టణంలోని డిసిసి కార్యాలయంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను అధ్యక్షులు షేక్ అల్లాబకాష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి చిన్న పిల్లలకు, మహిళాలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి నాగముని రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షుడు రఫీ, జిల్లా డిసిసి మైనారిటీ అధ్యక్షుడు మన్సూర్ అలీ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు దర్బార్ భాష, జిల్లా ఎసి సెల్ అధ్యక్షులు మంజునాథ, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు చెన్న క్రిష్ణ, జిల్లా ఆర్టీఐ చైర్మన్ అమీర్, జిల్లా మీడియా చైర్మన్ నరేష్ పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ఐకమత్యమే మహాబలం

- ఎపి ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కె.నారాయణ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఐకమత్యమే మహాబలమని ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కె.నారాయణ పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లి మండలం దేవలంపల్లి గ్రామం చెన్నకేశవస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ముదిరాజ్ ఐక్యవేదిక కార్తిక వనభోజనాలు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ జాతి ప్రజలందరూ కలిసిమెలిసి ఐక్యమత్తంగా ఉండాలని ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందించుకొని అభివృద్ధి బాటలోకి రావాలని ప్రతి ఒక్కరూ కూడా చదువులపై మక్కువ మక్కువ పెంచుకొనీ రాణించాలని అన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ ఐక్యవేదిక నాయకులు విజయభాస్కర్ మాట్లాడుతూ ముదిరాజులు భవిష్యత్తులో అన్ని రంగాలలో ముందుండాలని ఆకాంక్షించారు అనంతరం ముదిరాజ్ జాతి చరిత్రను పుస్తక రూపంలో అందించిన గుంటూరు జిల్లా వాసి శ్రీ భీమనాధుని శ్రీనివాస్ ముదిరాజు గారిని కుల బంధువులు నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వై.హైమావతి, రాజంపేట ముదిరాజ్ సంఘం అధ్యక్షులు శివశంకర్, దేవేంద్ర, మాజీ జడ్‌పిటిసి నరసింహులు, మూగి వెంకటరమణ, మద్దుల రామచంద్రయ్య, కొర్లకుంట కృష్ణయ్య, చలపతి, పాల్గొన్నారు

దేవులపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-కలకడ

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని దేవలపల్లిలో నిర్వహించారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో దేవులపల్లి రాతికుంటపల్లి గ్రామాలలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు చేస్తున్న సేవలను పథకాలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు, ఎంఇఒ మునీంద్ర నాయక్, ఎస్‌ఐ తిప్పేస్వామి, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వాలంటీర్స్, పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - బి.కొత్తకోట

అన్నదానం గొప్పదని లక్ష్మణ్ అన్నారు. తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం పురస్కరించుకొని ముంత గోకులపల్లికి చెందిన లక్ష్మణ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ అధ్యక్షులు తగాది రాజశేఖర్, డాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు. **ములకలచెరువు :** తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు ములకలచెరువులోని ఆయన నివాసం వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భారీ ఎత్తున అయన అభిమానులు పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎవి.లక్ష్మి దేవమ్మ అభిమానులతో సమావేశమై కాసేపు మాట్లాడారు.

అవినీతిని అంతమొందించాలి

- ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కె.శ్రీనివాసులు

ప్రజాశక్తి - బద్వేల్ : అవినీతిని అంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కె.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం అవినీతి అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవ సందర్భంగా స్థానిక సుందరయ్య భవనంలో ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. అవినీతి అభివృద్ధికి పెనుభూతం లాంటిది పేర్కొన్నారు. అవినీతి లేని దేశాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని, ప్రస్తుతం దేశంలో అవినీతి పెరిగిపోతుందని చెప్పారు. ప్రజలు అవినీతిలో కూరకు పోయారని, అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నిజాయితీగా అంకితభావంతో కృషిచేసి దేశ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన అన్నారు. పాలకులు ఓటర్లను అవినీతిపరులుగా తయారుచేసి దేశ అభివృద్ధి నిరుద్యోగులుగా తయారు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ నాయకులు ఆంజనేయులు, సురేంద్ర, బాల గురయ్యా, సిఐటియు నాయకులు రాజగోపాల్, గంప సుబ్బరాయుడు, మహిళా సంఘం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అనంతమ్మ, రత్తమ్మ, పట్టణ నాయకులు రమాదేవి, మోక్షమ్మ మస్తాన్, బి.కత్తినాగమ్మ పాల్గొన్నారు.

అవినీతి అభివృద్ధికి నిరోధకం

పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవ సమావేశం సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక ఆధ్వర్యాన జిల్లా ఉపాధ్యక్షులు బద్వేలు గురుమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులు యోగివేమన విశ్వవిద్యాలయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు కొండపల్లి చిన్న సుబ్బారావు మాట్లాడుతూ అవినీతి అభివృద్ధికి పెనుభూతంలాటిది అవినీతి లేని దేశాలే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని, సభాధ్యక్షులు గురుమూర్తి మాట్లాడుతూ పాలకులు ఓటర్లను అవినీతిపరులుగా తయారుచేసి దేశ అభివృద్ధి నిరోధకులుగా తయారైనారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ బద్వేలు పట్టణ అధ్యక్షులు ఎస్.ఎ. సత్తార్, బి.సి చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బిసి రమణ, సిపిఐ సీనియర్ నాయకులు వెంకట సుబ్బయ్య, జి.శ్రీనివాసులు కన్జ్యూమర్స్, హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు సి.నారాయణ, అంబేద్కర్ భవన అభివృద్ధ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జకరయ్య, కేశవ, యు.మునెయ్య, రిటైర్డ్ ఎంఇఒ రామసుబ్బయ్య, డివైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి జి.నాగార్జున, జాతీయ బి.సి సంక్షేమ సంఘ జిల్లా వర్కింగ్ అధ్యక్షులు రమణ యాదవ్, లెక్చరర్లు రవిబాబు,శ్రీనివాసులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత షేక్ మహబూబ్ సాహెబ్ ఉపాధ్యాయులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-కడప అర్బన్ : డిఆర్‌డిఎ సీడప్, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ రీజినల్ కో-ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి, ప్లేస్మెంట్ ఆఫీసర్ సాయి సునీల్ కుమార్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వైసిపి కార్యాలయం వద్ద నున్న నిహార్ మల్టీస్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జాబ్ మేళాలో సుమారు 15 నుంచి 20 కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. పదో తరగతి పాస్ అయిన , డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థులు ఉన్నతాశయంతో చదవాలి

ప్రజాశక్తి-పీలేరు : విద్యార్థులు ఉన్నతాశయంతో చదవాలని ఎంజెఆర్ కళాశాల చైర్మన్ ఎం.పి.ఆవినాష్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం పీలేరు ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ప్రెషర్స్ 2కె23ని ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సినీ నటుడు సంపూర్ణేష్ బాబు విద్యార్థులతో కలసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ఎంజెఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సినీ నటుడు సంపూర్ణేష్‌బాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది